క్లుప్తంగా

కుమార స్వామికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులు నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. సుబ్రహ్మణ్య స్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేకం నిర్వహించారు.

ప్రశాంతంగా పరీక్షలు రాయండి



విద్యార్థినులనుద్దేశించి మాట్లాడుతున్న డాక్టర్ సింధూజా ఓంకారం

బండి ఆత్మకూరు: ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని మానసిక వైద్యురాలు సింధుజా ఓంకారం సూచించారు. స్థానిక కేజీబీవీలో పదో తరగతి విద్యార్థినులకు ఒత్తిడి జయించడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరీక్షలు సమీపిస్తుండటంతో ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రణాళిక ప్రకారం సిలబస్ పూర్తి చేసుకోవాలన్నారు. పూర్తయిన పాఠాలను మననం చేసుకోవాలన్నారు. విశ్రాంతి కూడా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దాక్షాయిణి పాల్గొన్నారు.

బహుమతుల పంపిణీ



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఆత్మకూరు: భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో గత నెల 7న పదో తరగతి విద్యార్థులకు ‘ప్రజ్ఞ వికాసం’ నిర్వహించారు. విజేతలకు మంగళవారం బహుమతులను పంపిణీ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కె.దినేష్‌కుమార్, ఆత్మకూరు మండల అధ్యక్ష, కార్యదర్శులు సాయి, ప్రశాంత్, ఎస్వీ డైరెక్టర్ సాయిప్రణీత్ పాల్గొన్నారు.

శనగల బసవన్నకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలోని స్వామిఅమ్మవార్ల ఆలయ ప్రాంగణంలోని శనగల బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి, శ్రీశైలక్షేత్ర పాలకునిగా ప్రసిద్ధిగాంచిన బయలు వీరభద్ర స్వా మి వారికి మంగళవారం సందర్భంగా శాస్త్రోక్తంగా ఆలయ అధికారులు, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రదోషకాల సమయంలో క్షేత్రపాలకుడు వీరభద్రునికి, నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాది అర్చనలను నిర్వహించారు. ఆరంభ పూజల్లో భాగంగా లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. అనంతరం కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు గణపతి పూజ చేశారు. తరువాత నందీశ్వర స్వామి కి నూతన వస్త్ర సమర్పణ విశేషార్చనలను, నానపెట్టిన శనగలను, క్షేత్ర పాలకునికి ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించి కర్పూర నీరాజనాలు అర్పించారు.

ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

పగిడ్యాల: ఆటో కార్మికులను ఆదుకోవడానికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి వి.రఘురాం మూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం బస్టాండు ఆవరణంలో ఆటో కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రమేష్, దుబ్బన్న, వినోద్, రహిమాన్, శాలు, గిరి, తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతన చట్టం అమలు చేయాలి



పారుమంచాలలో డాక్టర్ యశశ్వినికి వినతిపత్రం అందజేస్తున్న ఆశా వర్కర్లు

జూపాడుబంగ్లా: ఆశా వర్కర్లకు కనీస వేతన చట్టం అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు కర్ణ డిమాండ్ చేశారు. మంగళవారం ఆశా వర్కర్లు పారుమంచాల, జూపాడుబంగ్లా ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లోని వైద్యులకు వినతిపత్రాలు అందజేశారు.

● పగిడ్యాల: ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పక్కీర్‌సాహెబ్ డిమాండ్ చేశారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అనిల్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు గోపాలక్రిష్ణ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

● నందికొట్కూరు: ఆశా వర్కర్ల సమస్యలను కూటమి ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ పట్టణ అధ్యక్షులు గోపాలకృష్ణ కోరారు. ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యురాలు దివ్యకు ఆశా వర్కర్ల సమస్యలతో కూడిన వినతి పత్రం సీఐటీయూ నాయకులు అందజేశారు.

మందుబాబుల బరితెగింపు

● ప్రభుత్వ కార్యాలయాలే వారికి అడ్డా
● తీవ్ర ఇబ్బందులు పడుతున్న మహిళా ఉద్యోగులు



పాత ముచ్చుమర్రి పశువుల ఆసుపత్రి వద్ద మద్యం తాగుతుస్తున్న యువకులు



పూటుగా మద్యం తాగి రైతు సేవా కేంద్రం తలుపు వద్ద పడిపోయిన దృశ్యం

పగిడ్యాల: కూటమి ప్రభుత్వంలో మందుబాబులు బరితెగిస్తున్నారు. గ్రామాల్లో విచ్చలవిడిగా మందు లభ్యమవుతుండటంతో బహిరంగంగా తాగుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలనే అడ్డాగా చేసుకుని పట్టపగలే దర్జాగా సిట్టింగ్ వేస్తున్నారు. వీరిని చూసి విధులకు హాజరయ్యేందుకు వచ్చిన మహిళా ఉద్యోగులు భయపడుతున్నారు. పాత ముచ్చుమర్రి బస్టాండు ఏరియా, ప్రాథమిక పాఠశాల సమీపంలో, పశువుల ఆసుపత్రి, రైతు సేవా కేంద్రం, ఆరోగ్య ఉపకేంద్రం, నూతన సచివాలయ భవనాలు అనధికార మద్యం విక్రయ కేంద్రాలుగా మారాయి. మందుబాబులు మద్యం తాగి ఖాళీ బాటిళ్లను కార్యాలయాల వద్దే పగుల గొట్టి పడేసి వెళ్తున్నారు. పోలీస్‌స్టేషన్ సమీపంలోనే ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కాగా పశువుల ఆసుపత్రి వద్ద మద్యం తాగే దృశ్యాలను సెల్‌ఫోన్‌తో ‘సాక్షి’ ఫొటోలు తీస్తుండడం గమనించిన మందుబాబులు అంతూ చూస్తామని బెదిరించడం గమనార్హం.

కూటమి నేతల కుమ్మక్కు!

● మహానందీశుడి ఆదాయానికి గండి కొట్టే యత్నం
● రెండోసారి టోల్‌గేట్ల టెండర్లు వాయిదా



తక్కువగా వచ్చిన టెండర్‌దారులు

మహానంది: మహానందీశ్వరస్వామి దేవస్థానంలో టోల్‌గేట్ల నిర్వహణకు నిర్వహించే బహిరంగ, సీల్డు టెండర్లకు తీవ్రమైన పోటీ ఉంటుంది. గత ప్రభుత్వంలో నిర్వహణ హక్కును పొందేందుకు పలువురు పోటీపడ్డారు. దీంతో మహానందీశ్వరస్వామికి భారీగా ఆదాయం సమకూరింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బడా, చోటా నేతలంతా మహానంది దేవస్థానంలో జరిగే టెండర్లపై కన్నేశారు. ఇప్పటికే పలువురు వివిధ విభాగాల టెండర్లలో పాల్గొని హక్కులను దక్కించుకున్నారు. అందరూ సిండికేట్ అవుతూ డిపాజిట్లను కట్టేందుకు వచ్చిన వారిని సైతం భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా మంగళవారం టోల్‌గేట్ల నిర్వహణ టెండర్లను రెండోసారి వాయిదా వేయించడంతో ఓకూటమి నేత కీలక పాత్ర పోషించినట్లు జోరుగా చర్చలు జరిగాయి.

ఆదాయానికి గండికొట్టే యత్నం

మహానంది దేవస్థానంలో నంద్యాల నుంచి మహానంది, మహానంది నుంచి గాజులపల్లె వెళ్లే మార్గంలో టోల్‌గేట్లను నిర్వహిస్తారు. వీటి నిర్వహణ బాధ్యతలను గతంలో దేవస్థానం ఆధ్వర్యంలోనే నిర్వహించేవారు. కానీ దేవస్థానానికి ఆదాయం పేరుతో గత కొన్నేళ్లుగా టెండర్లు నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ మేరకు గత రెండేళ్లుగా వీటి ద్వారా ఆలయానికి కోట్లలో ఆదాయ వస్తుంది. రెండేళ్ల క్రితం రూ. 1.51కోట్లు రాగా తాజాగా గత ఏడాది 1,71,22,535 ఆదాయం వచ్చింది. ఈ ఏడాది మరింత ఆదాయం వస్తుందని ఆశించిన అధికారులకు నిరాశే మిగిలింది. కూటమి నేతలు కుమ్మక్కై ఆదాయానికి గండికొట్టే దిశగా రెండోసారి వాయిదా పడేలా చేశారు. మంగళవారం జరిగిన టెండర్లలో నలుగురు సీల్డు టెండరు దాఖలు చేయగా ఓ కూటమి నేత గత ఏడాది కంటే తక్కువగా కేవలం రూ. 1.34కోట్లకు మాత్రమే సీల్డు టెండరు దాఖాలు చేయడంతో వాయిదా పడింది. దేవదాయశాఖ నిబంధనల మేరకు పాత టెండరు హెచ్చు మొత్తానికి 33శాతం అదనంగా ఉంటేనే హక్కు బాధ్యతలను అప్పగించాల్సి ఉంది. కానీ రెండు, మూడు సార్లు వాయిదా పడితే పోటీ ఎవరూ లేరని అనుకోవడంతో పాటు స్థానిక అధికారి ద్వారా కమిషనర్‌కు లేఖ రాయించి తగ్గింపు మొత్తానికి తీసుకోచ్చన్న పెద్దప్లాన్ పన్నినట్లు ఆలయ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఇప్పటికే ఈ విషయంపై రాష్ట్ర దేవదాయశాఖ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర ఆజాద్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు పలువురు సిద్ధమైనట్లు విశ్వసనీయ సమాచారం. మరి దేవదాయశాఖ ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందేనని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షలు ఇవ్వాలి



మృతురాలు బషిరూన్ కుమారుడితో మాట్లాడుతున్న శిల్పా చక్రపాణిరెడ్డి



నీలి తొట్ల వీధిలో మురుగు కాల్వ ను పరిశీలిస్తున్న శిల్పా చక్రపాణిరెడ్డి

● బాధితులకు న్యాయం చేయకపోతే కోర్టుకెళ్తా
● మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

ఆత్మకూరురూరల్: అతిసారా వ్యాధితో మృతిచెందిన వారి కుటుంబ సభ్యులకు రూ.25 లక్షల చొప్పున పరిహారం ఇచ్చి ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని 5, 9 వార్డుల్లో పది రోజులుగా కలుషిత నీరు తాగడం వల్ల ముగ్గురు మృతి చెందడం, పలువురు ఆసుపత్రుల పాలవడం తెలిసిందే. మంగళవారం ఆయన బాధితుల కుటుంబాలను పరామర్శించారు. ముందుగా ఆత్మకూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. అనంతరం ఆయన నీలితొట్ల వీధి, గొల్లపేటలతో వాంతులు, విరేచనాలతో మృతి చెందిన బషిరూన్‌బీ, రహంతుల్లా, నాయక్‌ల కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు. ప్రభుత్వం స్పందించి ఆయా కుటుంబాలకు రూ.25 లక్షలు పరిహారం అందజేయాలన్నారు. న్యాయం జరగకపోతే మాత్రం నిర్లక్ష్యం వహించిన మున్సిపాలిటీపై కోర్టులో కేసు వేస్తామన్నారు. సమస్యాత్మక కాలనీల్లో పర్యటించి అపరిశుభ్ర వాతావరణాన్ని పరిశీలించారు. వైద్యారోగ్య శాఖ చేపట్టిన చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. మంగళవారం కూడా మరో 7 కేసులు నమోదై ఉండడం చూసి ఆశ్చర్యపోయారు. ఆయనతోపాటు నాయకులు అంజాద్ అల, సయ్యద్ మీర్, ముస్తపా, రాజమోహన్ రెడ్డి, రాజేష్, సురేష్, రామచంద్రయ్య శెట్టి, ధను, లక్ష్మిరెడ్డి, కౌన్సిలర్లు ఉన్నారు.

ఎడ్ల బండలాగుడు పోటీలు ప్రారంభం



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచు రవియాదవ్

నందికొట్కూరు: మండల పరిధిలోని బిజినవేముల గ్రామంలో దేవుళ్ల విగ్రహ ప్రతిష్టను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఎడ్ల బండలాగుడు పోటీలను మంగళవారం సర్పంచ్ రవి యాదవ్ ప్రారంభించారు. గ్రామంలో గణపతి సహిత శ్రీల క్ష్మీసత్యనారాయణ స్వామి, సీతాలక్ష్మణహనుమ, రామచంద్రస్వామి, హనుమ ధ్వజ, వృషభ ధ్వజ, ఆలయ శిఖర సహిత, వీరాంజనేయస్వామి, రాధాకృష్ణ, వీరబ్రహ్మేంద్రస్వాముల ప్రతిష్ఠ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధతో నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు



బోనాలతో ఆలయానికి తరలి వెళ్తున్న భక్తులు

పాములపాడు: మండల కేంద్రంలోని చౌడేశ్వరిదేవి నూతన విగ్రహం ప్రతిష్ఠ సందర్భంగా మంగళవారం బోనాల కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలను తలపై ఎత్తుకుని అమ్మవారి ఆలయానికి బయలుదేరారు. డప్పుల హోరుతో అమ్మవారి చెంతకు ఊరేగింపుగా తరలి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు.

ఒప్పంద జీఓలు అమలు చేయాలి



పీహెచ్‌సీ సూపర్‌వైజర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఆశా కార్యకర్తలు

ఆత్మకూరు: ఆశా కార్యకర్తలకు వేతనాలు పెంచుతూ ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రతినిధి వర్గంతో 2024 ఫిబ్రవరి 9న అప్పటి ప్రభుత్వం చర్చలు జరిపి ఒప్పందం చేసుకున్న జీఓలు, సర్క్యులరు అమలు చేయాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ నాయకురాలు చంద్రకళ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని కొట్టాల చెరువు పీహెచ్‌సీ సూపర్‌వైజర్ సరోజమ్మకు వినతి పత్రం అందజేశారు. ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 6న నిర్వహించనున్న ధర్నాలో ఆశా కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు జీవరత్నమ్మ, రాధమ్మ, లింగమ్మ, భారతి, రమిజాబీ, సరళ, గౌసియా, చెన్నమ్మ పాల్గొన్నారు.

భూముల పరిశీలన



ఎర్రమఠం సమీపంలో రైతుల పత్రాలను పరిశీలస్తున్న తహసీల్దార్ ఉమారాణి

కొత్తపల్లి: కల్వకుర్తి–నంద్యాల జాతీయ రహదారి 167–కె కు చెందిన ఎర్రమఠం, సిద్ధేశ్వరం భూములను తహసీల్దార్ ఉమారాణి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్‌హెచ్ 167–కె రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులు సుమారు 25 మంది దాకా ధ్రువపత్రాలు ఇవ్వలేదన్నారు. వారికి చెందిన 18 ఎకరాల భూములలో ఎక్కడి నుంచి ఎటువైపు రహదారి వెళ్తుందని ఫీల్డ్ విజిట్ చేసి పరిశీలించామన్నారు. ఆమె వెంట డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న, సర్పంచు బాలఎల్లయ్య, వీఆర్వోలు మౌలాలి, వేణుగోపాల్ ఉన్నారు.

ఊబకాయంపై అవగాహన ర్యాలీ



ఊబకాయంపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మిడుతూరు: స్థానిక శ్రీలక్ష్మీచెన్నకేశవ హై స్కూల్ విద్యార్థులతో కలిసి మంగళవారం సామాజిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తిరుపతి ఊబకాయంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ అధిక బరువుతో రక్తపోటు, గుండెపోటు, మధుమేహం, కీళ్లనొప్పులు వస్తాయన్నారు. ఆహారంలో మార్పులు చేసుకోవడంతోపాటు వ్యాయామం చేయడం ద్వారా ఊబకాయాన్ని నివారించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనాథ్, పాఠశాల కరస్పాండెంట్ శివకిరణ్ పాల్గొన్నారు.

నిరుద్యోగ సమస్య తగ్గించేందుకు జాబ్ మేళా



జాబ్ మేళాను ఉద్దేశించి మాట్లాడుతున్న ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా అధికారి సుబ్బన్న

నందికొట్కూరు: నిరుద్యోగ సమస్యను తగ్గించేందుకే ప్రభుత్వం జాబ్ మేళా నిర్వహించిందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.సునీత, ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా అధికారి సుబ్బన్న అన్నారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారులు సుబ్బన్న, వెంకటరమణ, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.సునీత ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. రెండు కంపెనీల్లో పని చేసేందుకు 45 మంది నిరుద్యోగులు జాబ్ మేళాకు హాజరుకాగా 22 మంది యువకులను మాత్రమే ఎంపిక చేశారు. కార్యక్రమంలో స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల బోరు, పైపులు దగ్ధం



దగ్ధమైన బోరు, పైపులు

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంటలో ఉన్న మహాత్మా జ్యోతిభాపూలే బీసీ గురుకుల పాఠశాలకు తాగునీటిని సరఫరా చేసే బోర్లు మంగళవారం దగ్ధమయ్యాయి. పాత సున్నిపెంటలో బోర్లు, మోటార్లు, ఆపరేటింగ్ సిస్టం ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి నిత్యం గురుకుల విద్యార్థుల అవసరాలకు నీటిని పంపింగ్ చేస్తుంటారు. బీసీ, ఎస్టీ గురుకులాలకు, ఐటీడీఏ, కాలేజ్ హాస్టల్‌కు ఇక్కడి నుంచే నీరు సరఫరా అవుతోంది. బోర్లు ఉన్న ప్రాంతం చుట్టుపక్కల వారు చెత్త పడేస్తుండటంతో ప్రమాదవశాత్తూ చెత్తకు నిప్పంటుకుంది. దీంతో బీసీ గురుకుల పాఠశాల బోరు మోటార్, కేబుళ్లు, పైపులు దగ్ధమయ్యాయి. సుమారు రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు ప్రిన్సిపాల్ కేఎస్ జవహర్ తెలిపారు. నాలుగేళ్ల క్రితం కూడా ఇదే ప్రాంతంలో నిప్పంటుకుని బోర్ల మోటార్లు, పైపులు, కేబుళ్లు కాలిపోయాయి.

బెల్లంఊట ధ్వంసం

ఆత్మకూరు: మండలంలోని సిద్దపల్లె గ్రామ సమీపంలో నల్లమల అటవీ పరిధిలో మంగళవారం నాటుసారా బట్టీపై ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ కిషోర్‌కుమార్ మాట్లాడుతూ పక్కా సమాచారంతో సిద్దపల్లె గ్రామ సమీపంలోని నాటుసారా స్థావరాలపై దాడులు చేశామన్నారు. 700 లీటర్ల బెల్లం ఊట, నాటు సారాను ధ్వంసం చేశామన్నారు. సారా తయారీదారులు తమను చూసి పరారయ్యారన్నారు. వారి కోసం గాలింపు చేపట్టామన్నారు.

నెమలి మృతి

కొత్తపల్లి: మండల పరిధిలోని వీరాపురం బీట్ పరిధిలోని అటవీ ప్రాంతంలో నెమలి మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. వీరాపురం డొంగు సమీపంలోని సోలార్‌కుంట అటవీ ప్రాంతంలో అనుకోకుండా ఓ నెమలి అనారోగ్యంతో బాధపడుతూ సిబ్బంది కంట పడింది. వారు చికిత్స నిమిత్తం కొత్తపల్లి పశువైద్యశాలకు తీసుకెళ్లేలోగా మృతి చెందింది. ఈ విషయంపై ఫారెస్ట్ సెక్షన్ అధికారి జ్యోతి స్వరూప్‌ను వివరణ కోరగా రైతులు మొక్కజొన్న, మినుము పంటలకు వేసిన యూరియను తినడంతోనే నెమలి మృతిచెందినట్లు వైద్య సిబ్బంది ధ్రువీకరించారని వెల్లడించారు.

న్యూట్రీషన్‌పై అవగాహన సదస్సు

ఆత్మకూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మంగళవారం విద్యార్థులకు డైట్, న్యూట్రిషన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సూర్యకుమారి మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోకపోతే రక్తహీనత, బలహీనత తదితర సమస్యలు ఏర్పడతాయన్నారు. కోడిగుడ్డు, చిరుధాన్యాల్లో బెల్లం తీసుకుని ఆహారంగా భుజిస్తే విద్యార్థులకు మంచి పోషకాహారం అందుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పద్మావతిబాయి పాల్గొన్నారు.

వేటగాళ్ల ఉచ్చుకు రెండు వన్యప్రాణులు బలి

● ఫారెస్టు అధికారుల అదుపులో వేటగాడు

కొత్తపల్లి: వేటగాళ్ల స్వార్థానికి రెండు వన్యప్రాణులు బలైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పెద్దగుమ్మడాపురం బీట్ వైపు అటవీ ప్రాంతం ఆనుకొని ముసలిమడుగు గ్రామానికి చెందిన రైతు మునగ పొలం సాగు చేశాడు. తోటకు వేటగాళ్లు విద్యుత్ తీగలను అమర్చి రెండు కణతుల ప్రాణాలు బలిగొన్నారు. ఇదే పెద్ద గుమ్మడాపురం గ్రామ అటవీ సమీపంలో 2023 మార్చిలో నాలుగు పులి పిల్లలు ప్రజల కంట పడి కలకలం రేపాయి. వాటి తల్లి ఆచూకీ నేటికీ మిస్టరీగానే మిగిలిపోయింది. ప్రస్తుతం కణతుల విషయాన్ని కూడా అటవీ శాఖ అధికారులు బయటికి పొక్కకుండా ఘటనా ప్రాంతంలోనే పోస్టుమార్టం నిర్వహించి కాల్చివేయడంపై ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇదే విషయమై ఆత్మకూరు ఫారెస్ట్ రేంజ్ అధికారి పట్టాభిని వివరణ కోరగా రెండు కణతులు మృత్యువాత పడిన విషయం వాస్తవమేనని, ఈ ఘటనకు ముగ్గురు గిరిజనులు కారణమని, అందులో ఒకరిని అదుపులో తీసుకున్నామని చెప్పారు.

సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పాములపాడు: జాతీయ రహదారికి సమాంతరంగా సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని మండల పరిధిలోని చెలిమిళ్ల గ్రామస్తులు మంగళవారం ప్రజాసంఘాల నాయకులతో కలిసి తహసీల్దార్ సుభద్రమ్మకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో లింగాల సర్పంచ్ మల్లేశ్వర్ రెడ్డి, చెలిమిళ్ల సర్పంచ్ కోట్ల చంద్ర రెడ్డి, రైతు సంఘం నాయకులు స్వామన్న, వెంకటేశ్వరరావు, సీపీఎం నాయకులు రాజు, రైతులు కోట్ల నాగేశ్వర్ రెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించుకోండి



బర్రెకు టీకా వేస్తున్న పశుసంవర్ధక శాఖ సిబ్బంది

జూపాడుబంగ్లా: పశుపోషకులు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రామాంజనేయనాయక్ తెలిపారు. మంగళవారం పశువైద్యశాల వద్ద పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 31 వరకు పశువులకు ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్నామని, పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లైవ్‌స్టాక్ అసిస్టెంట్ నవీన్‌కుమార్, పశుసంవర్ధక సహాయ సిబ్బంది నాగలక్ష్మి, సుమన్ పాల్గొన్నారు.

● కొత్తపల్లి: మండలంలోని బర్రెలు, ఆవులు, ఎద్దులకు పశువైద్యాధికారి భువనేశ్వరి ఆధ్వర్యంలో వెటర్నరి అసిస్టెంట్ రామాంజి మంగళవారం గాలికుంటు నివారణ టీకాలు వేశారు. మండలంలో 3,500 పశువులు ఉన్నాయి. అందులో 600 పశువులకు గాలికుంట్ల నివారణకు టీకాలు వేశారు. మిగతా పశువులకు కూడా వెంటనే టీకాలు వేయించాలని యజమానులకు పశువైద్యాధికారి భువనేశ్వరి సూచించారు.

పశువులకు బీమా చేయించుకోండి

జూపాడుబంగ్లా: పశుపోషకులు రాయితీపై పశువులకు బీమా చేయించుకోవాలని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రామాంజనేయనాయక్ తెలిపారు. మంగళవారం ఆయన రైతులతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలతో పాటు బీపీఎల్ పరిధిలో ఉన్న పశుపోషకులకు ప్రభుత్వం రాయితీపై బీమా సౌకర్యం కల్పించిందన్నారు. ఈ అవకాశాన్ని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు

మిడుతూరు: సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని డీడీఏ చెన్నయ్య, నందికొట్కూరు ఏడీఏ విజయశేఖర్ రైతులకు సూచించారు. మంగళవారం మిడుతూరు, పీరుసాహెబ్ పేట గ్రామాల్లో రైతులతో కలిసి వారు పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి రైతు తమ పొలాన్ని రిజిస్ట్రీ చేసుకోవడం ద్వారా 11 అంకెల నంబర్ వస్తుందన్నారు. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే పథకాలు వర్తిస్తాయన్నారు. కార్యక్రమంలో ఏఓ పీరునాయక్, ఏఈఓలు అశోక్, మల్లికార్జున పాల్గొన్నారు.

● జూపాడుబంగ్లా: మినుము పంటలో వ్యాపించే తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి రైతులకు సూచించారు. పారుమంచాల, తూడిచెర్ల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులకు పలు సూచనలు చేశారు.

● కొత్తపల్లి: కంది సాగులో పూత దశలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని ఏఓ కె.మహేష్ సూచించారు. ఎదురుపాడు, గోకవరం గ్రామాల సమీపంలోని కందిపొలాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి కందిలో పూత సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.